# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యుత్ శాఖలపై ఈ రోజు సమీక్ష నిర్వహించారు.
- ఉద్యాన సాగు రైతులను బిందు సేద్యం వైపు మరింత ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.
- తల్లి పాలు సంపూర్ణ ఆహారమని, వీటిలో బిడ్డకు అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయని వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.
- అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళా శిశు సంక్షేమ శాఖపై ఈరోజు సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో భాగంగా మహిళలు, అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల కోసం అమలవుతున్న కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాలు, మహిళా సాధికారత, మాతా శిశుమరణాలు, మిషన్ వాత్సల్య ద్వారా చేపట్టే బాల సంరక్షణా కార్యక్రమాలు, గర్భిణులు, బాలింతలకు అమలవుతున్న పథకాలు, పిల్లలకు అందించే పౌష్టికాహార పథకాలు, 2014లో ప్రవేశపెట్టిన బాలామృతం, అమృత హస్తం, గోరుముద్ద, గిరి గోరుముద్ద, బాల సంజీవని వంటి పథకాల స్థితిగతులను తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలని అన్నారు. రాష్ట్రంలో వీలైనన్ని మహిళా వసతి గృహాలు అందుబాటులోకి తీసుకురావాలని, మహిళా శిశు సంక్షేమ శాఖలో మంచి ఫలితాలు సాధించేలా సరికొత్త ఆలోచనలతో కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.

అలాగే విద్యుత్ శాఖపై కూడా ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, యూనిట్ విద్యుత్ తయారీకి అవుతున్న వ్యయం, లోటును భర్తీ చేసేందుకు ఇతర గ్రిడ్ల నుండి కొనుగోలు చేస్తున్న విద్యుత్ కు అవుతున్న వ్యయం తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్ర రైతాంగానికి పగటిపూటే 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని అందుకు అనుగుణంగా ఆయా ఫీడర్ల సామర్థ్యాన్ని మెరుగు పరచడంతో పాటు ప్రత్యేక ఫీడర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాల్సి ఉందని, తక్కువ

ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి వంటి పరిస్థితులను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఇంధన శాఖ అధికారులను ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో "జీవన్ దాన్"పై అవగాహన కార్యక్రమంలో ఈరోజు మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ అవయవదానానికి అంగీకరిస్తూ సంతకం చేశారు. అవయవదానం చేసిన వారి కుటుంబ సభ్యులను ఆయన సత్కరించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... వేల మందికి పునర్జన్మ కలిగించేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్నా, ప్రజల్లో మార్పు రాలేదన్నారు. రాష్ట్రంలో 260 మంది అవయవ దానం కోసం ముందుకు వచ్చారని, 90 వేల మంది అవయవ దానం కోసం ఎదురు చూస్తున్నారన్నారని తెలియజేశారు. ప్రతీ సంవత్సరం 5 లక్షల మంది అవయవాలు చెడిపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని, జాతీయ స్థాయిలో కూడా చాలా తక్కువగా ఈ అవయవ దాన రిజిస్ట్రేషన్ లు ఉన్నాయన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములైన వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు బిందు సేద్యం (డ్రిప్ ఇరిగేషన్) పరికరాలను తక్షణమే రాయితీపై అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ సంవత్సరం 3 లక్షల హెక్టార్లలో సాగుకు రాయితీపై బిందు సేద్యం అమలు చేసేలా లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. తద్వారా రాష్ట్ర రైతాంగానికి ప్రత్యక్షంగా పరోక్షంగా 3 వేల 450 కోట్ల రూపాయలు అదనపు ఆదాయం సమకూరుతుందని అన్నారు. ఉద్యాన సాగులో 55 శాతం మాత్రమే బిందు సేద్యం అమలవుతోందని, నూరు శాతం ఉద్యాన సాగులో బిందు సేద్యం అమలు అయ్యేలా కృషి చేయాలని, అందుకు రాయితీపై బిందు సేద్యం పరికరాలను అందించేందుకు రిజిస్ట్రేషన్లు తక్షణమే ప్రారంభించాలని మంత్రి సూచించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

తల్లి పాలు సంపూర్ణ ఆహారమని, వీటిలో బిడ్డకు అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయని తూర్పుగోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ నెల 1 నుంచి 8వ తేదీ వరకు జిల్లాలో "ప్రపంచ తల్లిపాల వారోత్సవాల" నిర్వహణ కార్యక్రమాలపై ఈరోజు ఆయన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పుట్టిన బిడ్డకు తల్లిపాల ప్రాముఖ్యతను ప్రజలందరికీ తెలియజేసేలా అవగాహన కల్పించాలని వైద్యాధికారులను ఆదేశించారు. బిడ్డ పుట్టిన మొదటి గంటలో తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని, అందులో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందన్నారు. బిడ్డకు మొదటి 6 నెలలు తల్లి పాలే సంపూర్ణ ఆహారంగా ఇవ్వాలని, 6 నెలలు దాటిన తరువాత తల్లిపాలతో బాటు అనుబంధ ఆహారం అవసరమన్నారు. తల్లిపాలు వలన శిశువుకు న్యుమోనియా, అతిసార వంటి ప్రమాదకర మైన వ్యాదుల నుండి రక్షణతో పాటు పిల్లల మేదస్సును మెరుగుపరచడంలో సహాయ పడుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో తల్లిపాల వారోత్సవాల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని డాక్టర్ కె.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖపట్నంలోని ఐఎన్ ఎస్ (INS) డేగా నేవల్ ఎయిర్ స్టేషన్ లో నావల్ ఏవియేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్క్ షాప్ ఈరోజు ప్రారంభమైంది. తూర్పునావికాదళ ప్రధాన కార్యాలయానికి చెందిన సిఎస్ఓ రియర్ అడ్మిరల్ ఎం. మురళీ మోహన్ రాజు ఈ కార్యశాలను ప్రారంభించారు. భారత నావికాదళానికి చెందిన అన్ని నావల్ ఎయిర్ స్టేషన్‌ల నుండి ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విమాన కార్యకలాపాలకు మద్దతునిచ్చే సౌకర్యాలను సృష్టించడం, ఏవియేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్

యొక్క ప్రణాళిక, రూపకల్పన, నిర్మాణం, నిర్వహణ వంటి అంశాలకు సంబంధించిన అనే అంశాలపై ఈ కార్యక్రమంలో దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఐ.ఎన్.ఎస్. డేగాలో కొనసాగుతున్న ఎయిర్ ఫీల్డ్ ప్రాజెక్ట్‌ను కూడా ప్రతినిధులు సందర్శించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ దిశగా గాలులు బలంగా వీస్తున్నాయని, దీని ప్రభావంతో రాష్ట్రంలో తేలికపాటి నుండి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని వాతావరణ అధికారి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

నిరుపేద ప్రజలకు రాయితీపై నాణ్యమైన భోజనం అందించే అన్న క్యాంటీన్లు ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయని గుంటూరు నగర పాలక సంస్థ కమీషనర్ హరికృష్ణ తెలిపారు. కేవలం 5 రూపాయలకే భోజనాన్ని అందించటం ద్వారా సమాజంలోని పేద ప్రజలకు ఈ క్యాంటీన్లు ఆహార భరోసా కల్పించనున్నాయని అన్నారు. గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో 7 అన్న క్యాంటీన్లను సిద్ధం చేస్తున్నామని, ఈ నెల 5వ తేదీనాటికి పనులు పూర్తవుతాయని ఆయన వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

గుర్తు తెలియని వాహనాలు ఢీ కొన్నప్రమాదాలు (హిట్ అండ్ రన్)కి సంబందించిన కేసులలో బాధితులు పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా రెవిన్యూ అధికారి జె.కేశవ నాయుడు తెలిపారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో రెవిన్యూ, పోలీసు అధికారులు, బాధితులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు హిట్ అండ్ రన్ కేసులలో మరణించిన వారి కుటుంబీకులకు 2 లక్షల రూపాయలు, తీవ్రంగా గాయపడిన వారికి 50 వేల రూపాయల పరిహారం అందించబడుతుందని తెలిపారు. భాదితులు పరిహారం పొందడానికి వెంటనే దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. కాగా, ప్రమాదం తరువాత వాహనం గుర్తించినట్లయితే బీమా పొందవచ్చనీ, కానీ చాలా మంది బాధితులు బీమా పొందడానికి వీలు పడదనే ఉద్దేశంతో హిట్ అండ్ రన్ కేసులలో బాధితులకు కేంద్ర ప్రభుత్వం అందించే పరిహారం కోసం ముందుకు రావడం లేదని ఆయన అన్నారు. బీమా పరిహారానికి ప్రస్తుతం అందిస్తున్న పరిహారానికి సంబంధం లేదనీ, హిట్ అండ్ రన్ కేసులలో బాధితులందరూ దరఖాస్తు చేసుకోవచనీ ఆయన వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని ఈరోజు విశాఖలో ఘనంగా నిర్వహించారు. వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వన్ టౌన్ ప్రాంతంలో భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. పింగళి వెంకయ్యకు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించాలని సంస్థ అధ్యక్షులు డాక్టర్ సి.ఎమ్.ఏ. జహీర్ అహ్మద్ ప్రభుత్వాన్ని కోరారు. పింగళి వెంకయ్య కుటుంబాన్ని ప్రభుత్వాలు ఆదుకోవాలని, త్రివర్ణ పతాకాన్ని ఎలా గౌరవించుకుంటున్నామో దానిని రూపొందించిన పింగళి వెంకయ్యని కూడా అదే రీతిలో ప్రజలు గుర్తు చేసుకోవాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = =